# పత్రికారోపాఖ్యానము

## అను

## సాహితీకళాకారుని కడగండ్లు

కథాకాలం అలనాటిది. కథ మాత్రం మంచి కథ లన్నింటి లాగే అన్ని కాలాలకూ అన్వయించేది.

అది మథురా నగరం, అవి కరువు రోజులు.

"మానిసిని మానిసి తినునంతటి" కరువులో సహితం సరసతి కొరవడ లేదు ఆ రాజ్యంలో......

చక్కని కవిత వ్రాసిన కవికి వెయ్యి మాడ లిస్తున్నాడు రాజు.

చక్కని కవిత అంటే?

ఏది చక్కన? ఎవరికి చక్కన?

ఏదో ఒక శంఖంలో పోస్తేకాని ఎలాగూ తీర్థంకాదు- తన శంఖపీఠిపై స్థిరంగా అధివసించిన కవులే రాజుకి ప్రమాణం—

వారు 'అవున'న్నదే కవిత—

కరువు బాధ పడలేక గుడి వదిలిపోతానన్నాడు హారద్యుజుడు—

తన పూజారి తనకు దూరం కావటం సహించలేక పోయాడు హరుడు—

తనను సర్వజ్ఞుడని అననే అన్నారు—

ఆశ్రితునిపై ఆదరం చూపాడు. కవిత వ్రాశాడు మాడులుగా మార్చుకోమన్నాడు.

ఆ పూజారికి ప్రతిభా పాండిత్యాలు పూజ్యమే అయినా- తనది కాని కవితను, తనకు లోతుపాతులు తెలియని కవితను. మరొకరు వ్రాసిపెట్టిన కవితను తనదిగా చేత పట్టుకొని సభాస్థలి ప్రవేశించాడు- హారద్విజుడని కూడా తెలుసు. శంకరుని అండదండలున్నవాడని తెలుసు. అంచేత లోలోన నవ్వుకుని ఊరుకున్నారు.

వారిలో నదురు బెదురులేని వాడు సత్కారుడు చదువను, వ్రాయను చేతకాని వాడు మహాకవినంటూ కవులనే అపహాసిస్తోంటే భరించలేక పోయాడు.

"ఓ మహాకవీ, నిన్నే దేవతలు ఆ జన్మ కవిని చేశారయ్యా! బహుశః నీవు పదములు పలుకరాని కాలం నుంచే కవితలల్ల కరువురోజులు గద! కాసు కాశపడని దెవరు?

స్తోత్రపాఠాలు వల్లించటానికి మాత్రమే అలవాటు పడ్డాడు పూజారి......

అర్థ గర్భితంగా, భావస్ఫోరకంగా చదవ వలసిన కవితకు అస్తవ్యస్తపు ఉచ్చారణతో అపభ్రంశరూపాన్ని కల్పిస్తోంటే అదిరి పోయారు సభాసదులు.

అదీ ఒక రకమైన కవిత్వమే నను కొన్నారు అమాయకులు. శంఖపీఠిపై అధివసించిన కవులకు అసలు విషయం తెలియక పోలేదు. కానీ, దానితోపాటు అతడు ప్రారంభించి ఈనాటికి అదే కొనసాగిస్తున్నావు లాఉంది." అని పరిహసించాడు.

ఘొల్లుమన్నది సభ.

సత్కారుడన్న దేమిటో పూజారికంతు పట్టలేదు.

"ఆహా! నేనంటే నీకెంతటి అభిమానం. నా కవిత

నంత శ్రద్ధగా విన్నారు. ఇంత అందంగా ప్రశంసించారు!" అన్నాడు.

మరొక్కసారి ఘొల్లుమన్నది సభ.

సత్కీరుడు నవ్వుకొంటూ "ఓ పూజ్య కవీ! సభాస్థలికి వచ్చి నీవు కవిత వినిపిస్తోంటే మాబోటి వారికి వినక తప్పదుకదా! విన్న తరువాత వద్దనుకొన్నా తప్పొప్పులు తెలియక మానవుకదా! నీ పట్ల ఈ రకమైన అభిమానం సాహితీపరులంతా ఎప్పుడూ చూపుతోనే వుంటారు. నీవు ఎంతైనా ఆనందించవచ్చును. గర్వపడవచ్చును. అది సరే! నీ కవితలో "మదగజయాన కేశపాశము సహజ సుగంధము"ని వ్రాశావు. అదెలా సాధ్యమయ్యా!" అన్నాడు.

సత్కీరుడన్న మాటలకు అర్థంకూడా తెలియలేదు పూజారయ్యకు. తెల్లపోతూ "మళ్ళీ వస్తాను" అని నమస్కారంచేసి సభనుంచి బయటపడ్డాడు.

తిన్నగా శంకరుని దగ్గరకు వచ్చాడు. విరుచుకు పడ్డాడు.

"ఏమయ్యా! సర్వజ్ఞుడవని నిన్ను నమ్మి సభకు పోయాను. నవ్వుల పాలయ్యాను. లోకంలో సహజ శేముషీ సంపన్నులు సన్మానపాత్రులు కాగలరుకాని, ఎవరిదో

గ్రహించి మరేదో చదివితే నవ్వులపాలు కాక ఏమవు తాను?"

తన భక్తుని భంగపాటు శంకరుడు భరించలేక పోయాడు.

"ఎవడా నత్కీరుడు? నా కవితలో తప్పు పడతాడా? ఉండు! తేలుస్తాను" అని అప్పటికప్పుడే బ్రాహ్మణ వేషంలో సభాస్థలికి వచ్చి "ఆ కవితలో తప్పెక్కడ?" అని గట్టిగా అరిచాడు దర్పంతో.

నత్కీరుడు నవ్వుతూ "అహంకరించి అరిచినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. స్త్రీల కేశపాశము సహజసుగంధ మనటం తప్పుకాదా?" అన్నాడు.

శంకరుడు మండిపడుతూ "నీకు తెలియకపోతే నోరు మూసుకో? కొండరాజు కూతురు. పార్వతీదేవి కేశపాశము, సహజ సుగంధ భరితమే!" అన్నాడు.

నత్కీరుడు పకాలుమన్నాడు.

"ఇదెక్కడి విడ్డూరమయ్యా! లోకంలో వింతలూ. విడ్డూరాలూ, అనేకం ఉండవచ్చును. ఒకానొక కుటిల కుంత లను— కృష్ణసుందరిని, వల్లభుడాదరంతో అందలా లెక్కించ వచ్చును. అంత మాత్రాన పురుషులంతా స్త్రీలను పరమా

దరంతో చూస్తున్నారని అనగలమా? సత్యభామాదేవి పాద తాడనాన్ని శ్రీకృష్ణుడు మురిపెంతో స్వీకరించాడని, పురుషులందరకూ స్త్రీ పాదతాడనాలే అపరూపమని అనగలమా? ఒకానొక చండికను చెట్ట బట్టి వాడు తాటవాలిచాడని, పురుషులందరూ? స్త్రీలను హింసించే వారేనని అనగలమా ఒక మహాతల్లి ప్రియుడి కోసం కన్న బిడ్డను హత్యచేసిందని తల్లు లందరూ ప్రియుల కోసం పిల్లల్ని చంపుకొంటారని అనగలమా? ఎక్కడో కొండరాజు కూతురు కేశపాశం సహజ సుగంధభరిత మయితే కావచ్చును. అంత మాత్రం చేత నువ్వు దానిని సార్వజనీనసత్యంగా, సామాజీక న్యాయంగా ఎలా సూత్రించగల వయ్యా!"

సత్కీరుడింత యుక్తి యుక్తంగా మాట్లాడుతోంటె శంకరుడు సమాధానం చెప్పలేకపోయాడు. తన గొప్ప చూపించి సత్కీరుడి నోరు మూయించాలని నుదుటిమీద కన్ను చూపించాడు.

అప్పటికీ సత్కీరుడు లొంగలేదు.

"దేవుడు దిగివచ్చినా తప్పు తప్పే! నీకు కళ్ళు నెత్తి మీదకు వచ్చి అడ్డ దిడ్డపు వ్రాతలు వ్రాసి అదంతా కవిత్వ మని నన్ను ఒప్పుకోమంటే ఎలా కుదురుతుంది? ఆది

మధ్యాంత రహితుడవే? ఆకారణంగా వయసింత అని చెప్ప లేకపోయినా, వయసుమీరిన వాడవేకదా? సాహితీ విమర్శ లకు వ్యక్తిగత శృంగార జీవితాన్ని ముడివేస్తావా? అది సభాస్థలిని వినిపిస్తావా? దానిని నీ కవితను సమర్థించటాని కొక ఆధారంగా చూపిస్తావా? ఆహాహా! ఏమి ఔచిత్య మయ్యా!"

శంకరుని మనసు మూడవ కన్నును మించి మండి పోయింది. శాస్త్రోక్తమైన వాదనలో సత్కీరుణ్ణి గెలవలేక శాపనార్థాలలోకి దిగాడు.

సత్కీరుడు నీరు కారిపోయాడు. రెండు చేతులూ జోడించి "స్వామి! అపరాధినే! సాహితీ చర్చలను శాప నార్థాలలోకి దింపగలిగిన వారున్నారని తెలియక నీతో వాదనకు దిగాను. శాపమోక్షం అనుగ్రహించు—" అన్నాడు.

శంకరుడు కోరేది తన గొప్ప— దాని ప్రచారం.

"కైలాస శిఖరాన్ని దర్శించు శాపమోక్ష మవు తుంది" అని అంతర్థానమయిపోయాడు.

కాలం కలిసి రానపుడు ఎవరయినా తల వంచక తప్పదు. సత్కీరుడు కైలాస శిఖరానికి బయలుదేరాడు.

మార్గమధ్యాన తారసిల్లింది ఒక మహావృక్షం. దాని ఆకులు నీళ్ళలో పడినవి చేపలుగా మారుతున్నాయి. గట్టున చేరినవి పక్షులుగా ఎగురుతున్నాయి. ఒక ఆకు సగం నీటిలో పడింది, సగం గట్టున పడింది. సగం చేపగా, సగం పక్షిగా మారి ఈదలేక, ఎగరలేక అవస్థపడుతోంది. ఆ వింతను గమనించిన సత్కీరుడు— కవి గనుక ఆ వృక్ష పత్రాలకు తాను చదివిన కొన్ని గ్రంథాలలోని తాళపత్రాలతో అభేదం కల్పించుకొంటూ ఆహా ఇక్కడ అసంఖ్యాకమైన పత్రాలున్నాయి కానీ ఒక్కదానికైనా స్వయం వ్యక్తిలేదు. కేవలం బహిరుపాధి నాశ్రయించుకొని ఆయా రూపాలలో వ్యక్తమవుతున్నాయి. మరి కొన్నిటికి ఆ మాత్రం శక్తి కూడా లేకుండా అటూ ఇటూ ఏదీ కాని రూపాలలో సాక్షాత్కరిస్తున్నాయి" అనుకొన్నాడు.

వెంటనే వికటహాసంతో, వికృతాకారంతో అతని ముందు ప్రత్యక్ష మయిందొక భూతం.

"ఇంక నిన్ను బ్రతకనీయను. నమిలి మింగేస్తాను" అంది.

సత్కీరుడు ఆశ్చర్యపోతూ "ఎవరు నువ్వు? ఎందుకు చంపుతావు?" అన్నాడు.

మూర్ఖుడా! కళ్ళముందు కనిపిస్తోన్నా గుర్తించలేవా? నేను జనవాక్యాన్ని. మూలం ఏదయితేనేం కారణాలు ఎలా ఉంటేనేం? చేపలుగా ఈదుతూ పక్షులుగా ఎగురుతూ నన్ను అలరిస్తోన్న వాటిని విమర్శించే నిన్ను క్షమించను. కొద్ది మందే అయినా నీ బోటి వారు మరికొందరున్నారు. వారితో పాటు నిన్నూ అంతంచేస్తాను....."

భీకరగర్జనలతో ఆ భూతం సత్కీరుణ్ణి బిలంలోత్రోసి బండరాయి మూసింది. భూతం చెప్పినట్లే ఆ బిలంలో క్రుగ్గి పోతూ సత్కీరుడి వంటివారు మరికొందరున్నారు. వారంతా సత్కీరుణ్ణి చూసి నిరాశతో "మహాకవీ! నువ్వుకూడా చేరావా? మనకు నూరేళ్ళు నిండినట్లేనా?" అన్నారు.

సత్కీరుడు ధైర్యం చెపుతూ అంతగా కృంగిపోకండి జన వాక్యం ఎంతటి భూతమైనా సద్విమర్శకులకు సంపూర్ణంగా హతమార్చలేదు. నా ఆరాధ్యమూర్తి కుమారస్వామి ఉన్నాడు. అతని ఆధిపత్యంలో అమర శక్తులు నాశనంచేసే దేవసేన ఉంది ఆధునికుడు-అభ్యుదయ భావాలు కలవాడు-మనకు సహాయపడవచ్చును" అని కుమారస్వామిని ప్రార్థించారు.

అప్పుడు కుమారస్వామి ప్రత్యక్షమై తన శక్తితో భూతాన్ని నాశనంచేసి సత్కీరుడికి విముక్తి కలిగించాడు.

"కుమారా! ఇంక మాబోటి వారి అవస్థలింతేనా? నీవైనా ఆదుకోలేవా? అని ఆక్రోశించాడు సత్కీరుడు. కుమారస్వామి ఆలోచిస్తూ "నాకు మాత్రం కష్టంగా లేదను కున్నావా? కానీ ఈ జనవాక్యానికున్న శక్తి ఎంత గొప్పది. యాగం చెయ్యాలని మేకను కొన్నాడు బ్రాహ్మణుడు. దానిని దొంగలించాలని సంకల్పించుకున్నారు నలుగురు దొంగలు. అదేపనిగా "కట్టి కుక్క, కట్టి కుక్క, కట్టి కుక్క" అన్నారు. అక్కడితో తాను స్వయంగా మేకను కొన్న బ్రాహ్మణుడే దానిని కుక్కగా భ్రమించి వదిలివేశాడు. ఈ ఒక్క భూతంతో అయిందా? ఇలాంటి భూతాలు నీ మార్గ మధ్యంలో కోకొల్లలు అన్నాడు.

"అయితే మనకిక మార్గాంతర మేదీ లేదా?"

"అదే ఆలోచిస్తున్నాను. ఈ భూతాలను ఎదుర్కొని నాశనం చెయ్యాలనుకోవడం వెర్రితనం. మచ్చిక చేసుకుని లొంగదీసుకోవాలి. మందును మద్యంగా చూపి త్రాగించాలి. మన మార్గానికి మళ్ళించి తేవాలి. మా తండ్రి కైలాసంకదూ, చూడమన్నాడు? నువ్వు కైలాసం చూడకు. కాళహస్తి చూడు. శాపం పోయేలా నేను చూస్తాను. ఒక చిన్న మెలిక పెడదాం. కైలాసం చూస్తే శాపంపోతుంది. కాళహస్తిని చూడగానే శాపం పోయింది కనుక అదే కైలాసం...... ఈ మాత్రం నిరూపించ గలిగితే ఆ తరువాత

నెమ్మదిగా కాళహస్తి కమలాపురం అనవచ్చును. ఆపైన అదే హృదయకమలం అనవచ్చును. కానీ, మనకైనా ప్రచారం అవసరమే. నువ్వు కాళహస్తినే కైలాసంగా నిరూపిస్తూ కవిత్వం వ్రాయాలి."

సత్కీరుడి ముఖం వెలిగిపోయింది. "నన్ను కవిత్వం వ్రాయమనటం కంటె నాకింకేం కావాలి స్వామీ? కాళహస్తి మీద వ్రాయమన్నా ఫరవాలేదు. కంకరరాయిమీద వ్రాయమన్నా ఫరవాలేదు. నేను చెప్పదలచుకున్నదే చెపుతాను. విషయానికి అన్వయించి విధానంలో మేళవించి, ఆ మాత్రం చాతుర్యమైనా నాకు లేకపోతే అందరూ అతులిత మాధురీ మహిమ" అంటూ అబ్బురపడేది దీన్ని చూసి!"

"శుభమస్తు" చేయెత్తి ఆశీర్వదించాడు కుమారస్వామి.

—।०।—

మోహన్ [illegible] బుక్ షాపు
మునిసిపల్ హైస్కూలు ఎదురు
కొత్తపేట, తెనాలి - 522 201
చినిగిన నోట్లు తీసుకొనబడును.